క్లుప్తంగా

సేవా గుణమే క్రిస్మస్ లక్ష్యం



గద్వాలటౌన్: సేవా గుణమే క్రిస్మస్ లక్ష్యమని పలువురు పాస్టర్లు అన్నారు. ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మహిళా సమైక్య భవన్‌లో సీనియర్ పాస్టర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడారు. క్రిస్మస్ అంతరార్థం సేవా గుణమనే లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. సాటి మనుషులపై ప్రేమను, శాంతియుత సహజీవనం, క్షమాగుణం కలిగి ఉండటమే నిజమైన క్రీస్తుతత్వమని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి జ్యోతి హాజరై పాస్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

తాగునీటి తంటాలు



ఇటిక్యాల: మండల కేంద్ర పరిధిలోని సాతర్లలో తాగునీరు సక్రమంగా అందక నిత్యం తంటాలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి నల్లాల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. కానీ కొంత కాలంగా మిషన్ భగీరథ పథకం నిర్లక్ష్యానికి గురవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ముఖ్యంగా మిషన్ భగీరథ పథకం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందని ఆరోపిస్తున్నారు. తాగునీటి బోరు పాడవడంతో రోజుల తరబడి సరఫరా జరగడం లేదని వాపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో చేతి పంపులు, వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి అష్టకష్టాలు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రాకపోకలకు అంతరాయం

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని రెండో రైల్వే గేట్ ట్రాక్ సమీపంలో మరమ్మతు కారణంగా ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గేట్ మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఉంటుందన్నారు. వాహనదారులు సహకరించగలరని పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామానికి చెందిన నాగేషులు కూలీలకు కూలి డబ్బులు చెల్లించేందుకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన కుమార్ పాతగొడవల నేపథ్యంలో నాగేషులుపై కర్రతో ఆదివారం దాడి చేశారు. దాడి విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

వాల్‌పోస్టర్ విడుదల



ఖిల్లాఘనపురం: సంచార విముక్త జాతుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ ఎనుముల చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంచార జాతుల విముక్త దినోత్సవం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం విముక్త దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం సంతోషించదగిన విషయమన్నారు. ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, పొన్నాల కుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం ముందరితండాలో పాఠశాల ప్రాంగణంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం గ్రామకమిటీని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మేరకు మేఘావత్ దేవుజ కమిటీ అధ్యక్షుడిగా, సభావట్ శ్రీనివాసులు ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పక్కాగా వేళకు వచ్చేలా..!

- ఎఫ్‌ఆర్‌ఎస్‌తో సమయానికి విధులకు
- విద్యార్థులకు హాజరు శాతం పెరిగే అవకాశం
- శుభపరిణామం అంటున్న విద్యావేత్తలు



మానవపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

మానవపాడు: ఉదయం బడిగంట మోగకముందే ఉపాధ్యాయులు పాఠశాలకు పరుగులు పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 1వ తేదీ నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టం) యాప్ ద్వారా టీచర్ల హాజరును నమోదు చేస్తోంది. ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4.15 నిమిషాల తర్వాత రెండు సార్లు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సిందే. దీంతో మొన్నటి వరకు ఇష్టారాజ్యంగా పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు.. ఇప్పుడు ఉదయం 9 గంటల్లోపే విధులకు హాజరవుతున్నారు.

17 గ్రామ పంచాయతీల్లో..

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మొత్తం 24 పాఠశాలల్లో మొత్తం 2840 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నెట్‌వర్క్ సరిగా పని చేయని గ్రామాలు కూడా ఉన్నాయి. అలాంటి పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టం) యాప్ ద్వారా విద్యార్థులకు హాజరు పట్టిను నిర్ణయిస్తారు. దీంతో ఏఏ పాఠశాలలో ఎంత శాతం మంది విద్యార్థులు తెలుసుకోవచ్చు.

సాకులు లేవు

మొన్నటి వరకు కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు ఆలస్యంగా వెళ్లేవారు. ఒక వేళ హెచ్‌ఎం అడిగితే ఎదురు తిరిగేవారు. మరి కొందరు రాజకీయ అండతో ఇష్ట మొచ్చినట్లు వ్యవహరించేవారు. కొందరు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి ఉందని పలువురు ఉపాధ్యాయులు వాపోయిన పరిస్థితి ఉందని పేర్కొన్న సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటిని ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ యాప్ చెక్ పెడుతుందని విద్యా వేత్తలు పేర్కొంటున్నారు.

సమస్యలు ఉన్నాయి..

గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగ్గా లేకపోవడం వల్ల హాజరు నమోదు సమస్యగా మారుతోంది. యాప్ పని చేయకపోతే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. రోజు రెండు సార్లు తప్పని సరిగా చేయడం వల్ల పరీక్షల డ్యూటీలు, సర్వేలు, ట్రైనింగ్‌ల వంటి పనుల అంతరాయం కలిగిస్తున్నాయని కొందరు ఉపాధ్యాయులు అంటున్నారు.

నిర్ణీత సమయంలోనే...

ఉదయం 9 గంటలోపు ఉపాధ్యాయులు వారు పని చేస్తున్న పాఠశాలకు వెళ్లి ఎఫ్‌ఆర్‌ఎస్‌లో అటెండెన్స్ వేసుకోవాలి. అదే పాఠశాల ఆవరణలో నిల్చొని అటెండెన్స్ వేస్తేనే ఫొటో క్యాప్చర్ అవుతుంది. 9 గంటలకు ఒక్క నిమిషం దాటినా యాప్‌లో హాజరు ప్రజెంట్ అని చూపినా పక్కన రెడ్ మార్కు కనబుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అలాగే సాయంత్రం 4.15 గంటల లోపు వెళ్లినా హాజరు తీసుకోదు. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలకు పూర్తి సమయం కేటాయించడంపై విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెద్దఆముదాలపాడులో హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

మంచి నిర్ణయం



రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగానైన మంచి నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలలకు హాజరు అవుతారు. విద్యార్థులు కూడా సమయానికి వస్తారు. తర్వాత పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగే అవకాశం ఉంది.

– విష్ణువర్ధన్
ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జల్లాపురం

అలవాటు పడతారు



ఫేస్ రికగ్నేజేషన్ ద్వారా హాజరు సరిగ్గా రికార్డు అవుతుంది. మాన్యువల్‌గా తప్పుడు హాజరు నమోదుకు అవకాశం లేదు. గురువులు సమయ పాలనలో ఉంటే విద్యార్థులు కుడా అలవాటు పడతారు. పాఠశాలల్లో విద్య ప్రమాణాలు పెరుగుతాయి.

– శివప్రసాద్,
ఎంఈఓ, మానవపాడు

మాల పౌర్ణమి ప్రత్యేక పూజలు



శాంతినగర్‌లో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు



ఉండవెల్లిలో మాంసం విక్రయం చేస్తున్న ప్రజలు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మాల పౌర్ణమి వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. మాంసాహారం ముట్టకుండా గణనాథులను 12వ రోజుల పూజించి అనంతరం పౌర్ణమి సందర్భంగా వారి సాంప్రదాయం మేరకు మాంసాహారం తీసుకుంటున్నట్లు మండల కేంద్రంలోని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆలయంలో గోపూజలు

శాంతినగర్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అలయ ప్రాంగణంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గోవుకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గో ప్రచారక్ సేవా సమితి ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పసుపు, కుంకుమ, గంధం బొట్లతో అలంకరించారు. గోమాతకు అలంకరించిన చీరను వేలంలో దొంతు భవాని కైవసం చేసుకున్నారు. పూజల అనంతరం ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో గోప్రచారక్ అధ్యక్షుడు శ్రీనివాసులు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం వెంకటేశ్వర్లు, గొంగళ్ల వెంకట్రాముడు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడులో ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. గ్రామం నుంచి ఇర్కిచేడు తండాకు వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ కంచె లేకపోవడంతో పశువులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రజినిబాబు

అలంపూర్: జాతీయ మాల మహానాడు అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా దార రజినిబాబును నియమించినట్లు నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాల మహానాడులో క్రియాశీలకంగా పని చేస్తున్న రజినిబాబును జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌రావు నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రజినిబాబు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌కు, జిల్లా అధ్యక్షుడు మాల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మాల జాతి ఐక్యత, ఔనత్యం, అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ శాతం అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, నిజమైన అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానీ వారి వివరాలను సేకరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గోపాల కృష్ణ మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని పేద ప్రజలు పాత ఇళ్లను కూలగొట్టుకున్నారని, కొర్రీలు పెట్టి వారికి మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేయకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శంకరన్న, లక్ష్మణ్‌గౌడ్, ఆంజేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా ?



గుంతలమయంగా చెన్నిపాడు - మానవపాడు రోడ్డు

మానవపాడు: గుంతలను రోడ్లను పూడ్చండి సారూ.. అంటూ మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోకులపాడు, చెన్నిపాడు, మానవపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో గుంతల రోడ్లతో నానా అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడి ఆస్పత్రులు పాలవుతున్నామని వాపోతున్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు

రోడ్డుపై మురుగు పారుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారని మండలంలోని నారాయణపురం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఈ దారి అధికారులు ప్రయాణాలు చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మురుగు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మలుపులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మలుపుల వద్ద కనీసం ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్దకల్– మద్దెలబండ, అమరవాయి –బిజ్వారం, పెద్దొడ్డి– మల్దకల్, కుర్తిరావులచెర్వు– మల్దకల్ గ్రామాల మధ్య రోడ్లపై సూచిక బోర్డులు లేవని పేర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మలుపుల వద్ద సూచిక బోర్డులు లేని అమరవాయి- బిజ్వారం రోడ్డు



నారాయణపురంలో రోడ్డుపై పారుతున్న మురుగు

కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఇటిక్యాల: తెలంగాణలో మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మునగాల గ్రామానికి చెందిన అనూషమ్మకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన సంచార చేపల విక్రయ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. మహిళల కోసం వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పెట్రోలు బంకులు, సోలార్ కంపెనీలు, ఇందిరాశక్తి క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ కంపెనీలు, ఆర్టీసీ అద్దె బస్సులు వంటి వ్యాపారాల్లో మహిళా సంఘాలకు అవకశాలు కల్పిస్తున్నామన్నారు. మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందని, చేపలు తినడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. చేపల పరిశ్రమను మరింత అభివృద్ధి చేయడానికి విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాకాలను మహిళలు అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రుక్మందర్‌రెడ్డి, మత్స్యశాఖ డైరెక్టర్ రాముడు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, సూర్యకాంత రెడ్డి, ఇబ్రహీం, అనంతరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



ఉచిత ట్యూషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంక్షేమ సంఘాల ప్రతి నిధులు

గట్టు: విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మస్తాన్‌రావు పెసల్ల కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఉచిత ట్యూషన్ కేంద్రాన్ని మస్తాన్‌రావు పెసల్ల, తెలంగాణ బాలోత్సవ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్ దుర్గే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందాలన్నారు. ఉపాధ్యాయురాలు నర్మద మాట్లాడుతూ.. ఉచిత ట్యూషన్‌ను విద్యార్థులు చక్కగా ఉపయోగించుకోవాలని కోరారు. దేశంలోనే అత్యంత వెనుక బడిన మండలముగా గట్టు ఉందన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో ఆఖిరి స్థానం



మురుగు కాల్వను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: ఆస్తి పన్ను వసూళ్లలో అయిజ మున్సిపాలిటీ రాష్ట్రంలో ముందు వరుసలో ఉంటుందని కానీ అభివృద్ధి విషయంలో ఆఖరిలో స్థానంలో ఉందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మడ్డిగుంత కాలనీని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మడ్డిగుంత కాలనీలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. మురుగు కాల్వలు పూర్తిగా పూడికతో నిండి ఉన్నాయన్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో కాలనీలో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు ఉధృతి చెంది ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని వాపోయారు. పారిశుద్ధ్య పనులు చేపట్టకుంటే ప్రజల తరుపున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న యువత

గద్వాలటౌన్: అవకాశం లభించినప్పుడల్లా ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జేఏసీ నాయకుడు మధుసూదన్‌బాబు అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. రక్తదానం అన్నింటి కన్నా మిన్నా అని, ఆపత్కాలంలో అవసరమైన రక్తాన్ని అందించి ప్రాణాన్ని రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్ కాంత్రి, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు పల్లయ్య, ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతికూర్ రహమాన్, సభ్యులు మహమ్మద్, రహిమతుల్లా, ఇక్బాల్, ఉప్పేర్ నర్సింహ పాల్గొన్నారు.

శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం

- చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలు మూసివేత



బీచుపల్లి ఆలయ ముఖద్వారాలు మూసివేస్తున్న అర్చకులు



కోదండ రామస్వామి ఆలయ ముఖద్వారం మూసివేస్తున్న అర్చకులు

ఇటిక్యాల: రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వివిధ ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. మండలంలోని బీచుపల్లి ఆభయ ఆంజనేయస్వామి, కోదండ రామస్వామి ఆలయాలతో పాటు పెద్దదిన్నె శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలను అధికారులు మధ్యాహ్నం 1 గంటకు మూసివేశారు. ఆలయ శుద్ధి అనంతరం సోమవారం భక్తులకు దర్శనం ప్రారంభించనట్లు పేర్కొన్నారు.

నేడు ఎన్నికల నిర్వహణపై సమావేశం

వీపనగండ్ల: రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. 8 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల వివరాలు, పూర్వం ప్రకటించిన ఓటర్ జాబితా తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నోటీసులకే పరిమితమా?

- ఫ్లెక్సీ తొలగించిన అధికారులు



వెంచర్‌లో అనుమతి లేకుండానే రోడ్లు వేసి జెండాలను పాతిన నిర్వాహకులు



బూడిదపాడు శివారులో వెంచర్ ఫ్లెక్సీ తొలగించిన పంచాయతీ సిబ్బంది

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు శివారులో వెలిసిన లేపాక్షి టౌన్ షిప్ వెంచర్‌లో ఒకసారి నాలా కన్వెర్షన్ లేదని, మరోసారి భూమి రిజిస్ట్రేషన్ లేదని, ఇంకోసారి డీటీపీసీ అప్రూవల్ లేదని పంచాయతీ నోటీసులు అందజేసింది. కానీ వెంచర్ పేరు ఒకటుంటే.. ఇంకో పేరు మీద ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో గ్రామ పంచాయతీలో ఎలాంటి అనుమతి లేదని అధికారులు తెలిపారు. శనివారం పంచాయతీ అధికారులు టౌన్‌షిప్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారు. అదే విధంగా ఆదివారం టౌన్‌షిప్ యాజమాన్యానికి నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలో ఎన్ని వెంచర్లు అనుమతులు లేకుండా సాగుతున్నాయో మండల అధికారులు పరిశీలించకపోవడంతో మోసపోతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంచర్లు వేసి రోడ్లు వేశారు, ఇంటి నిర్మాణం కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు నోటీసులకే పరిమితమవుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.